క్లుప్తంగా

శుభకార్యం



పెళ్లికుమారుడిని ఆశీర్వదిస్తున్న శిల్పా చక్రపాణి రెడ్డి

వెలుగోడు: పట్టణంలోని శిరివెళ్ల అబ్దుల్ రవూఫ్ కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరయ్యారు. పెళ్లికుమారుడిని ఆశీర్వదించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు దేశం తిరుపెం రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ ఇలియాస్‌ఖాన్, షంషీర్ అలీ, మహమ్మద్ ఖాన్, చాంద్ బాషా ఉన్నారు.

పశుగ్రాసం దగ్ధం



కాలిపోతున్న పశుగ్రాసం

వెలుగోడు: మండల పరిధిలోని రేగడ గూడూరు గ్రామంలో ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న పశుగ్రాం దగ్ధమైంది. రైతు రేగడగూడూరు నుంచి వెలుగోడుకు ట్రాక్టర్‌లో వరిగడ్డిని తీసుకెళ్తుండగా సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి సమీపంలో వీధి స్తంభాలకు ఉన్న కరెంటు వైర్లు తాకి మంటలు చెలరేగాయి. డ్రైవరు ఎస్సీ కాలనీ దాటిన తర్వాత గడ్డిని రోడ్డుపైనే పడేసి వెళ్లిపోయాడు. కాలనీవాసులు బిందెలతో నీరు పోసి మంటలను ఆర్పివేశారు.

నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు మేజర్ పంచాయతీ దివంగత సర్పంచ్ ఎంఏకే జిలానీ వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సార్ బీసీ కాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిలానీ కుమారుడు మోమిన్‌మునీర్‌బాషా, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్, కౌన్సిలర్ మోమిన్‌గౌస్ అజం తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో వెస్ట్ బెంగాల్ ఐఏఎస్ పూజలు



వేదాశీర్వచనం అందుకుంటున్న ఐఏఎస్ కిశోర్, కుటుంబ సభ్యులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో వెస్ట్‌బెంగాల్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ కిశోర్ కుమార్, కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు.

మహానందీశ్వరుడి దర్శనానికి రెండు గంటలు



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: సెలవురోజు కావడం, పెళ్లిళ్లు అధిక సంఖ్యలో ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు మహానంది ఆలయానికి తరలిరావడంతో దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, పి.సుబ్బారెడ్డి, ఎం.నీలకంఠరాజులు ఏర్పాట్లు చేశారు.

లాడ్జీల్లో తనిఖీలు



లాడ్జీల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నంద్యాల: జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని లాడ్జీల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని పలు లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు రిజిస్టర్ ఆధారంగా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు ధ్రువపత్రాల ఆధారంగా సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, ఎవరిపైనా అనుమానాలు ఉంటే తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు.

లోక రక్షకుడు ఏసుప్రభువు

• ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ భక్తులు, (ఇన్‌సెట్) సీఎస్ఐ టౌన్ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ఫాదర్ శామ్యూల్ రత్నరాజు

నందికొట్కూరు: పాపులను రక్షించేందుకు లోక రక్షకుడు ఏసుప్రభువు తిరిగి మూడవ రోజు లేసొచ్చారని రెవరెండ్ ఫాదర్ శామ్యూల్ రత్నరాజు అన్నారు. ఆదివారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వెలసిన చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా చర్చీలకు చేరుకుని ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ రత్నరాజు ప్రసంగిస్తూ ఏసుప్రభువు పాపుల కోసం సిలువపై రక్తం చిందించారన్నారు. లోక రక్షకుడు చూపిన మార్గంలో నడవాలన్నారు. అనంతరం ఫాదర్ మోహన్‌రాజ్ గాంధీ ప్రసంగించారు. అలాగే సీఎస్ఐ చర్చి యూత్ డైరెక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమాధి నమూనాను క్రైస్తవులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి జాన్ క్రిసోస్టమ్, కోశాధికారి జయచంద్ర, ఆర్‌సీఎం చర్చి ఫాదర్స్ ఆధ్వర్యంలో, ఏబీఎం సంఘ, హోసన్న చర్చి, ఆయా చర్చిల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ఇందిరానగర్‌లో రంగులు చల్లుకుంటున్న క్రైస్తవ సోదరులు

ఆత్మకూరు: మండలం వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. క్రీస్తు రాకకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ శాంతి, సామరస్యం, క్రీస్తు అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ప్రార్థనా మందిరాల్లో పాస్టర్‌లు క్రైస్తవ బోధనలు వినిపించారు. క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి ఆనందోత్సవాల మధ్య వేడుకలు నిర్వహించుకున్నారు. ఇందిరానగర్, ఎస్పీజీ పాలెం, ఏబీఎం పాలెం కాలనీలతో పాటు మండల వ్యాప్తంగా ఈస్టర్ యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాల మధ్య వేడుకలు నిర్వహించుకున్నారు.

• కొత్తపల్లి: మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం వేకుజామున సీఎస్ఐ సంఘ పాస్టర్ భరత్ దివాకర్‌బాబు, జీవన్ ఇమ్మానుయేల్ బాబు సీఎస్ఐ సంఘ చర్చీలలో, ఫాదర్ బెర్నాడ్ ఆర్సీఎం చర్చీలలో, గురువు రవికుమార్ ఏబీఎం చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన వృత్తాంతాన్ని ప్రవచనాల రూపంలో వివరించారు. ఉదయం అన్ని గ్రామాల్లో ఏసుక్రీస్తు తిరిగి పునరుర్థానుడు అయ్యాడన్న సంతోషంలో క్రైస్తవులు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



పాములపాడు జెరూసలేం శాలలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్) భక్తి గేయాలు ఆలపిస్తున్న దృశ్యం

పాములపాడు: ఏసుక్రీస్తు పునరుత్థానమును పురస్కరించుకుని ఆదివారం మండలంలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని గ్రామాల ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు ఏసుక్రీస్తు పునరుత్థానమును గురించి వివరించారు. మానవాళి శాంతి కోసం ప్రభువు బోధించిన మాటలను ప్రజలకు తెలియజేశారు. పలువురు ఆలపించిన ప్రార్థనా గేయాలు అలరించాయి. ప్రార్థనల అనంతరం భక్తులందరికీ ఆశీర్వాద భోజనం ఏర్పాటు చేశారు.

ఘనంగా పునరుత్థాన వేడుకలు

పగిడ్యాల: మండలంలోని ముచ్చుమర్రి, నెహ్రూనగర్, వనములపాడు, లక్ష్మాపురం, పగిడ్యాల, ప్రాతకోట, గణపురం తదితర గ్రామాల్లో ఆదివారం ఏసు క్రీస్తు పునరుత్థాన(ఈస్టర్) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రార్థనా మందిరాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు ఈస్టర్ వేడుకలను ప్రాధాన్యతగా జరుపుకొని ఏసు శ్రమ దినములను జ్ఞాపకం చేసుకోవడం విశేషమని పాస్టర్ సౌందర్‌రాజు అన్నారు. అనంతరం క్రైస్తవులు రంగులు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు.



జీ.వీరాపురంలో రంగులు చల్లుకుంటున్న క్రైస్తవులు



గువ్వలకుంట్ల గ్రామంలో సీఎస్ఐ చర్చీలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

• జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లోని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. క్రీస్తు పునర్జన్మ పొందిన దినాన్ని పురస్కరించుకుని తాటిపాడు, పారుమంచాల, తూడిచెర్ల, తరిగోపుల, తర్తూరు, మండ్లెం, జూపాడుబంగ్లా, 80 బన్నూరు, తరిగోపుల, పి.లింగాపురం, భాస్కరాపురం, పోతులపాడు తదితర గ్రామాల్లోని చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మంటలు ఆర్పే విధానాన్ని చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: అగ్నిప్రమాదాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి బి.భీముడునాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజు, కరిముల్లా, జిలానీ, గౌస్, మోహన్‌రాజు, సుబ్బయ్య, చాంద్‌బాషా, నరసింహా, నాయక్, రఫిక్, శ్రీనివాసులు, అన్సర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు జలమయం

చిన్నపాటి వర్షానికే మండల కేంద్రం సున్నిపెంట సీసీ రోడ్లు జలమయమవుతున్నాయి. డ్రైనేజీలు ఏర్పాటు చేయకుండా సీసీ రోడ్లు వేయడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేక ఎక్కడికక్కడే రోడ్లపై నిలిచి పోతున్నాయి. శనివారం కురిసిన తేలికపాటి వర్షానికి రాజీవ్‌గాంధీ కాలనీ సమీపంలో నిర్మించిన సీసీ రోడ్డు దుస్థితి ఇదీ. – శ్రీశైలంప్రాజెక్ట్

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకుడు వై.ఆశీర్వాదం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 23న జరిగే ముస్లింల నిరసన కార్యక్రమానికి తమ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో కార్మిక, ప్రజాసంఘాల నాయకులు వై.శ్రీను, పి.మల్లికార్జున, ఎస్.కె.షేక్షావలి, ఎం.డి.హఫీజ్.ఆసిఫ్, నాగూర్‌వలి, ముర్తుజా, సమద్, హోలీ బాబు పాల్గొన్నారు.

కళలను మరింత ప్రోత్సహిస్తాం



రవికృష్ణను సత్కరిస్తున్న గురురాజ డైరెక్టర్లు

నంద్యాల(న్యూటౌన్): కళలను మరింత ప్రోత్సహిస్తామని రంగస్థలం పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గురురాజ విద్యాసంస్థల్లో రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థలం పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణను జ్ఞాపికలతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. గురురాజ డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ కళారాధన, గురురాజ స్కూల్ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం నందినాటకోత్సవాల్లో వరుసగా ఏడు సంవత్సరాలు బాలల సాంఘిక నాటక విభాగంలో రెండు బంగారు, రెండు వెండి, రెండు కాంస్య, నంది అవార్డులు అందుకుందన్నారు. ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యుడు మధుసూదనరావు, లయన్స్‌క్లబ్ నాయకులు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు విద్యుత్ అంతరాయం

నందికొట్కూరు: మూడు రోజుల పాటు (21, 22, 23వ తేదీలలో) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నేషనల్ హైవే రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో విద్యుత్ లైన్ ఎత్తు లేనందున సవరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీశైలం, నియోజకవర్గాల వినియోగదారులు సమస్యను గమనించాలన్నారు.

విగ్రహ ప్రతిష్ట వేడుకలు

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో వరసిద్ధి వినాయక సహిత వీరాంజనేయ సహిత, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాల్లో ఆదివారం విగ్రహ ప్రతిష్ట వేడుకలను పురోహితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 10.41 గంటలకు ఆలయాల ప్రతిష్ట, సాయంత్రం ప్రాతఃకాల పూజలు, హోమం యంత్ర, విగ్రహ అభిషేకాలు చేశారు. పూజల్లో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

మహానంది: ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదని లేకుండా చూడాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కోనేరుల నుంచి నీరు బయటికి వచ్చే సబ్‌ఛానల్స్‌లో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని తొలగించాలని ఆయన ఆదివారం సిబ్బందిని ఆదేశించారు. అనంతరం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి, శానిటేషన్ పనుల ఇన్‌చార్జ్ ఎం.లక్ష్మయ్యలతో కలిసి కోనేటి కాల్వలను పరిశీలించారు.

రహదారి భద్రతపై అవగాహన

మహానంది: స్థానిక వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం తమ్మడపల్లెలో రహదారి భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని వారు ద్విచక్రవాహనదారులకు సూచించారు.

చెరువును కాపాడండి

మహానంది: గుంటూరు నుంచి గుంతకల్లు రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా గాజులపల్లె రైల్వేస్టేషన్, నంద్యాల వద్ద పనులకు చెరువుల నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపునకు అనుమతులు ఇవ్వడం దారుణమని గోపవరం వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ గోపవరం గ్రామంలోని బైరవాణి చెరువు నుంచి సుమారు 75 వేల క్యూబిక్ మీటర్ల మట్టి(సుమారు 55వేల టిప్పర్లు) తరలింపునకు అధికారులు అనుమతి ఇవ్వడం బాధాకరమన్నారు. మట్టి తరలింపు కోసం రైల్వే అధికారులు చెరువులో ఉన్న నీటిని బయటికి తరలిస్తే రైతుల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. క్యూబిక్ మీటర్‌కు రూ.1 చొప్పున అనుమతులు తెచ్చుకుని చెరువులను కొల్లగొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. అధికారపార్టీ నేతలు, ఉన్నతాధికారులు పునరాలోచించి అనుమతులు రద్దు చేసి చెరువును కాపాడాలని కోరారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కోటేష్

నంద్యాల(అర్బన్): జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని కోటేష్ అకాడమీ డైరెక్టర్ కోటేష్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులతో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. కోటేష్ మాట్లాడుతూ ఈ నెల 5న విజయవాడలోని డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో 12వ బాలుర జాతీయ స్థాయి చిత్రకళ ప్రదర్శన పోటీలు జరిగాయన్నారు. పోటీలకు కోటేష్ ఆర్ట్ అకాడమీ నుంచి 28 మంది విద్యార్థులు వేసిన చిత్రాలు పంపగా 16 మంది చిత్రాలు పతకాలు సాధించాయన్నారు. పసిడి, రజత, సర్టిఫికెట్లను డ్రీమ్ ఆర్ట్ అకాడమీ కొరియర్ ద్వారా పంపారన్నారు. సాహిత్, మృదుల, రాగవైష్ణవి, శ్రేష్ఠ, లాస్యశ్రీ, సాయిహవీస్, జోషిక, దిబంకూర్ బంగారు పతకాలు సాధించారు.

అగ్నిమాపకశాఖ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సబ్ జైలర్ యోగేష్‌కుమార్

బనగానపల్లె రూరల్: అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని బనగానపల్లె సబ్ జైలర్ యోగేష్‌కుమార్ అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలు జరిగిన సమ యంలో ఎంతో ధైర్యంతో ప్రమాదాల నివారణకు కృషి చేయడం అభినందనీయమని, ముఖ్యంగా అమరావతిలో జరిగిన ఫ్లడ్స్ సమయంలో వీరి సేవలు మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఈశ్వర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. పెద్దమ్మ జాతర సందర్భంగా మే 11న ముడుపు కడుతున్నందున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

గాలివాన బీభత్సం

శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో అకాల వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఆదివారం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పలు చోట్ల వడగండ్ల వర్షం కురిసింది. అక్కడక్కడా వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి. కళ్లాల్లో ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోయాయి. – ఆత్మకూరు

• పలుచోట్ల వడగండ్ల వర్షం



ఆత్మకూరులో వర్షం కురుస్తున్న దృశ్యం



అర్బన్ కాలనీలో నిలిచిన వర్షపునీటిని చూపుతున్న కాలనీవాసులు, సీపీఎం నాయకులు

ఆత్మకూరులో ఆదివారం సాయంత్రం వరుణుడు బీభత్సాన్ని సృష్టించాడు. పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు మండుటెండలు ఉండటంతో రైతులు వర్షం పడుతుందని ఊహించలేకపోయారు. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షానికి మొక్కజొన్న, పొగాకు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి పలు కాలనీల్లో రోడ్లపై నీరు నిలిచి తీవ్ర ఇబ్బందిగా మారింది. అర్బన్ కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతోనే రోడ్లపై వర్షపు నీరు నిలిచిందని, వెంటనే ప్రభుత్వం చర్యలు డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

• పాములపాడు: మండలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రంలో వారపు సంత కావడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది.

• పగిడ్యాల: మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన పెనుగాలులతో కూడిన వర్షానికి వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రాతకోట ముస్లిం కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు.

• కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం, బట్టువారిపల్లె, కొక్కెరంచ, ఎదురుపాడు, జడ్డువారిపల్లె గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గువ్వలకుంట్ల, వీరాపురం, బావాపురం, నందికుంట, దుద్యాల గ్రామాల్లో మోస్తారు వర్షంతోపాటు ఈదురు గాలులకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

• జూపాడుబంగ్లా: గాలి, వాన తాకిడికి మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, పారుమంచాల, తంగడంచ, మండ్లెం, తర్తూరు, పోతులపాడు, 80బన్నూరు, భాస్కరాపురం తదితర గ్రామాల్లో 4గంటల పాటు విద్యుత్ అంతరాయం నెలకొంది. ఈదురుగాలుల తాకిడికి చెట్లు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ అంతరాయం నెలకొంది. ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ లైన్ల వెంట ఉన్న చెట్లను తొలగింపజేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

జూన్1న ప్రతిభకు పట్టాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి కర్నూల్ జిల్లా పరిధిలోని పద్మశాలీ కులానికి చెందిన విద్యార్థులను ప్రోత్సహిస్తు జూన్ 1వ తేదీన ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తామని పద్మశాలీయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు భీమునిపల్లి వెంకటసుబ్బయ్య, గాజుల శంకర్ తెలిపారు. ఆదివారం భద్రవతి భావనరుషి దేవాలయంలో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 10వ తరగతిలో 540మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులు పైబడి సాధించిన వారు ఇందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.7,500, మూడో బహుమతిగా రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతిగా రూ.2వేలు అందజేస్తామని వివరించారు. వివరాలకు ఎం. మంగపతి, సెల్: 939045889 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ నెల 15వ తేదీలోపు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను అందజేయాలని చెప్పారు.

రక్తదానంతో ప్రాణదానం

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఫరూక్ ప్రారంభించారు.